रजिस्ट्री सं डी—२२१
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య డి--221

विधायी II अनुभाग
राजभाषा खण्ड
डा. सं..........
तारीख........

मूल्य रु 5.00 पैसे
[Price Rs. 5.00 Paise.
మూల్యము : రూ. 5.00 పైసలు

सत्यमेव जयते

# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण
**EXTRAORDINARY**
అసాధారణ

भाग XVI अनुभाग 1
**Part XVI Section 1**
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
**PUBLISHED BY AUTHORITY**
ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

| | | | | |
|---|---|---|---|---|
| सं १<br>No. 1<br>సంఖ్య 1 | नई दिल्ली<br>New Delhi<br>న్యూఢిల్లీ | सोमवार<br>Monday<br>సోమవారము | ९ जून २००८/१० वैशाखा<br>9 June, 2008/20 Vaishakha<br>9 జూన్, 2008/20 వైశాఖ | खंड १५<br>Vol. 15<br>సంపుటము15 |

## MINISTRY OF LAW AND JUSTICE
## (LEGISLATIVE DEPARTMENT)

New Delhi, 10th March, 2008/18 Maga, 1930 Servadari

The Translations in Telugu of the following Acts namely:-

(1) The Working Journalists and Other Newspaper Employees (Conditions of Service) and Miscellaneous Provisions Act, 1955 (Act No. 45 of 1955); (2) The University Grants Commission Act, 1956 (Act No. 3 of 1956); (3) The Medicinal and Toilet Preparations (Exercise Duties) Act, 1955 (Act No. 16 of 1955); (4) The Prevention of Cruelty to Animals Act, 1960 (Act No. 59 of 1960) and (5) The National Commission for Women Act, 1990 (Act No. 20 of 1990) are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Texts thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Texts (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

# శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ
## (శాసన నిర్మాణ విభాగము)

ఈ క్రింది చట్టములు, అనగా:-

(1) వర్కింగు జర్నలిస్టుల మరియు ఇతర వార్తాపత్రిక ఉద్యోగుల (సేవా షరతులు) మరియు వివిధ నిబంధనల చట్టము, 1955 (1955 లోని 45వ చట్టము); (2) విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషను చట్టము, 1956 (1956 లోని 3వ చట్టము); (3) ఔషధీయ మరియు ప్రసాధన ద్రవ్యముల తయారీ (ఎక్సైజు సుంకముల) చట్టము, 1955 (1955 లోని 16వ చట్టము); (4) జంతువులపట్ల క్రూరత్వ నివారణ చట్టము, 1960 (1960 లోని 59వ చట్టము) మరియు (5) జాతీయ మహిళా కమీషను చట్టము, 1990 (1990 లోని 20వ చట్టము)ల యొక్క తెలుగు అనువాదములను రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఆ చట్టములకు గల ఈ అనువాదములను ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973 లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఏ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# జాతీయ మహిళా కమీషను చట్టము, 1990
## (1990లో 20వ చట్టము)

(30 ఆగస్టు, 1990)

జాతీయ మహిళా కమీషనును ఏర్పాటు చేయుటకు మరియు దానికి సంబంధించిన లేక దాని పరిణామికమైన విషయములను నిబంధించుటకైన చట్టము.

భారత గణరాజ్యము యొక్క నలుబది ఒకటవ సంవత్సరములో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయబడినది.

అధ్యాయము – 1

ప్రారంభిక

1. (1) ఈ చట్టమును జాతీయ మహిళా కమీషను చట్టము, 1990 అని పేర్కొనవచ్చును. సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము.

(2) ఇది జమ్మూ–కాశ్మీరు రాజ్యము మినహా యావద్భారత దేశమునకు విస్తరించును.

(3) ఇది, కేంద్ర ప్రభుత్వము, రాజపత్రములో అధిసూచన ద్వారా నియతము చేయునట్టి *తేదీన అమలులోనికి వచ్చును.

2. ఈ చట్టములో, సందర్భమునుబట్టి అర్థము వేరుగా ఉన్ననే తప్ప,— నిర్వచనములు.

(ఏ) "కమీషను" అనగా 3వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన జాతీయ మహిళా కమీషను అని అర్థము;

(బీ) "మెంబర్" అనగా కమీషను మెంబర్ అని అర్థము, ఇందు మెంబర్-సెక్రటరీ కూడా చేరియుండును.

(సీ) "నిర్ణీత" అనగా ఈ చట్టము క్రింద చేసిన నియమముల ద్వారా నిర్ణీతపరచిన అని అర్థము.

అధ్యాయము – 2

జాతీయ మహిళా కమీషను

3. (1) ఈ చట్టము క్రింద ఒసగబడిన అధికారములను వినియోగించుటకు, మరియు అప్పగించబడిన కృత్యములను నిర్వర్తించుటకు కేంద్ర ప్రభుత్వము, జాతీయ మహిళా కమీషను అనబడు ఒక నికాయమును ఏర్పాటు చేయవలెను. జాతీయ మహిళా కమీషను ఏర్పాటు.

(2) కమీషను ఈ క్రింది సభ్యులతో కూడియుండవలెను.

(ఏ) చైర్‌పర్సను – మహిళాభ్యుదయమునకు పాటుపడు వారినొకరిని కేంద్ర ప్రభుత్వము నామనిర్దేశము చేయవలెను.

---

*31.1.1992 (ఎస్.ఓ.99 (ఈ), తేదీ 31.1.1992 (ప్రకారం).

(బి) కేంద్ర ప్రభుత్వముచే నామనిర్దేశము చేయబడు మెంబర్లు అయిదుగురు – వీరు న్యాయశాస్త్రము లేక శాసన నిర్మాణములో అనుభవమున్న వారు కార్మిక సంఘ ఉద్యమము, మహిళల ఉద్యోగ అవకాశాలను పెంపొందించుటకు పాటుపడు పరిశ్రమ లేక సంస్థ యొక్క యాజమాన్యము, మహిళా స్వచ్ఛంద సంస్థలు (క్రియాశీల మహిళా కార్యకర్తలతో సహా) పరిపాలన, ఆర్థికాభివృద్ధి, ఆరోగ్యము, విద్య లేక సాంఘిక సంక్షేమ రంగాలలో సామర్థ్యము, చిత్తశుద్ధి మరియు అనుభవము కలిగిన వ్యక్తులైయుండవలెను:

అయితే, వీరిలో అనుసూచిత కులములకు చెందిన మెంబర్ ఒకరు, అనుసూచిత జనజాతులకు చెందిన మెంబర్ ఒకరు ఉండవలెను;

(సీ) కేంద్ర ప్రభుత్వముచే నామనిర్దేశము చేయబడు మెంబర్–సెక్రటరీ ఒకరు, వీరు––

(i) నిర్వహణ, వ్యవస్థాగత నిర్మాణము లేక సామాజిక ఉద్యమ రంగాలలో నిపుణుడైయుండవలెను; లేక

(ii) కేంద్ర సివిలు సర్వీసు యొక్క లేక అఖిల భారత సర్వీసు యొక్క సభ్యులైన లేక కేంద్ర ప్రభుత్వము క్రింద సముచితమైన అనుభవము కలిగిన సివిలు పదవి అధికారియైయుండవలెను.

చైర్‌పర్సను మరియు మెంబర్ల పదవీ కాలావధి మరియు సేవా షరతులు.

4. (1) ఛైర్‌పర్సన్ మరియు ప్రతి మెంబర్ కేంద్ర ప్రభుత్వము ఈ విషయములో నిర్దిష్టపరచిన విధముగా మూడు సంవత్సరములకు మించని కాలావధిపాటు పదవియందుండును.

(2) ఛైర్‌పర్సన్ లేక మెంబరు (కేంద్ర సివిలు సర్వీసు యొక్క లేక అఖిల భారత సర్వీసు యొక్క సభ్యుడైన లేక సంఘములో సివిలు పదవియందున్న మెంబర్–సెక్రటరీ కాక) స్వదస్తూరీతో కేంద్ర ప్రభుత్వమునకు వ్రాయుట ద్వారా, ఛైర్‌పర్సన్ లేక సందర్భానుసారముగా మెంబర్ పదవికి ఎప్పుడైనను రాజీనామా చేయవచ్చును.

(3) కేంద్ర ప్రభుత్వము, ఉపపరిచ్ఛేదము (2)లో పేర్కొనిన ఛైర్‌పర్సన్ లేక మెంబర్ పదవి నుండి, ఆ వ్యక్తి––

(ఏ) విముక్తికాని దివాలాదారుడు;

(బి) కేంద్ర ప్రభుత్వ అభిప్రాయములో నీతిబాహ్యతలో కూడిన అపరాధమునకు దోషస్థాపితుడై, కారాగారవాస శిక్షకు గురి అయినచో;

(సీ) మతిస్థిమితము లేనివాడైయుండి, ఆ విధముగా సమర్థ న్యాయస్థానము ప్రఖ్యానించబడినచో;

(డి) వ్యవహరించుటకు నిరాకరించినచో లేక వ్యవహరించుటకు అశక్తుడైనచో;

(ఇ) హాజరు కాకుండుటకు కమీషను నుండి అనుమతి పొందకుండా దాని మూడు వరుస సమావేశములకు హాజరుకానిచో, లేక

(ఎఫ్) కేంద్ర ప్రభుత్వ అభిప్రాయములో పదవిలో కొనసాగించుటవలన ప్రజాహితమునకు భంగకరముగా అట్టి ఛైర్‌పర్సన్ లేక మెంబర్ పదవిని దుర్వినియోగ పరచినచో,

ఆ వ్యక్తిని తొలగించవచ్చును;

అయితే ఏ వ్యక్తినిగాని ఆ విషయములో అతనికి విన్నవించుకొనుటకు యుక్తమైన అవకాశము, ఇచ్చిననే తప్ప ఈ ఖండము క్రింద తొలగించరాదు.

(4) ఉపపరిచ్ఛేదము (2) క్రింద లేక ఇతర విధముగా ఏర్పడిన ఖాళీని క్రొత్తగా నామనిర్దేశము చేయుట ద్వారా భర్తీచేయవలెను.

(5) ఛైర్‌పర్సన్ మరియు మెంబర్లకు చెల్లించవలసిన జీతములు, భత్యములు మరియు వారి సేవకు సంబంధించిన ఇతర నిబంధనలు, షరతులు నిర్ణీత పరచబడినట్లుగా ఉండవలెను.

5. (1) కేంద్ర ప్రభుత్వము, ఈ చట్టము క్రింద కమీషను కృత్యములను సమర్థవంతముగా నిర్వహించుటకు అవసరమగునట్టి అధికారులను, ఉద్యోగులను సమకూర్చవలెను. కమీషను అధికారులు, ఇతర ఉద్యోగులు.

(2) కమీషను ప్రయోజనముల కొరకు నియమించబడిన అధికారులకు మరియు ఇతర ఉద్యోగులకు చెల్లించవలసిన జీతములు, బత్తెములు మరియు వారి యొక్క సేవకు సంబంధించిన ఇతర నిబంధనలు, షరతులు నిర్ణీతపరచబడినట్లుగా ఉండవలెను.

6. ఛైర్‌పర్సన్ మరియు సభ్యులకు చెల్లించవలసిన జీతములను, బత్తెములను మరియు 5వ పరిచ్ఛేదములో పేర్కొనిన అధికారులకు, ఇతర ఉద్యోగులకు చెల్లించ వలసిన జీతములు, బత్తెములు, మరియు పింఛనులతో సహా, పాలనా వ్యయములను 11వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1)లో పేర్కొనిన గ్రాంట్ల నుండి చెల్లించవలెను. జీతములను మరియు భత్యములను గ్రాంట్లలో నుండి చెల్లించ వలసియుండుట.

7. కమీషను యొక్క ఏ చర్యగాని, ప్రొసీడింగు గాని, ఆ కమీషనులో ఏదేని ఖాళీ ఉన్నదను లేక దాని ఏర్పాటులో ఏదేని లోపము ఉన్నదను కారణమాత్రమున వివాదాస్పదము కారాదు లేక శాసనమాన్యత కోల్పోవదు. ఖాళీలు మొదలైన వాటి వలన కమీషను ప్రొసీడింగులు శాసనమాన్యతను కోల్పోవకుండుట.

8. (1) కమీషను, ఆయా సమయములందు తాను చేపట్టినట్టి ప్రత్యేక సమస్యలలో వ్యవహరించుటకై అవసరమగునట్టి కమిటీలను నియమించవచ్చును. కమీషను యొక్క కమిటీలు.

(2) కమీషను, కమీషను మెంబర్లు కానట్టి ఉపపరిచ్ఛేదము (1) క్రింద నియమింపబడిన ఏదేని కమిటీ యొక్క మెంబర్లను, తాము సబబని భావించునంత మందిని మెంబర్లుగా కోఆప్ట్ చేసుకొనుటకు అధికారము కలిగియుండును. అట్లు

కో-ఆప్టు చేసుకొనబడిన వ్యక్తులు కమిటీ సమావేశములకు హాజరై దాని ప్రొసీడింగులలో పాల్గొనుటకు హక్కు కలిగియుందురు, కాని వారికి ఓటు వేయుటకు హక్కు ఉండదు.

(3) ఆ విధముగా కో-ఆప్టు చేసుకొనబడిన వ్యక్తులు కమిటీ సమావేశములకు హాజరగుటకై నిర్ణీతపరచినట్టి భత్యములను పొందుటకు అర్హులైయుందురు.

కమీషనుచే క్రమబద్ధము చేయబడవలసిన ప్రక్రియ.

9. (1) కమీషను లేక దాని కమిటీ అవసరమైనప్పుడెల్లనూ సమావేశము కావలెను మరియు ఛైర్‌పర్సన్ అవసరమని భావించునట్టి సమయములో మరియు అట్టి స్థలమునందు సమావేశము కావలెను.

(2) కమీషను తన ప్రక్రియను మరియు దాని కమిటీల ప్రక్రియలను క్రమబద్ధము చేయవలెను.

(3) కమీషను యొక్క అన్ని ఉత్తరువులను మరియు నిర్ణయములను మెంబర్ సెక్రటరీ లేక ఈ విషయమున మెంబర్ సెక్రటరీచే తగు రీతిగా ప్రాధికారము పొందిన కమీషను యొక్క ఎవరేని ఇతర అధికారి అధిప్రమాణీకరించవలెను.

## అధ్యాయము – 3

## కమీషను కృత్యములు

కమీషను కృత్యములు.

10. (1) కమీషను ఈ క్రింది అన్ని లేక ఏవేని కృత్యములను నిర్వహించవలెను, అవేవనగా:-

(ఏ) సంవిధానములోను మరియు ఇతర శాసనములలోను మహిళలకై నిబంధించబడిన రక్షణలకు సంబంధించిన అన్ని విషయములను దర్యాప్తు చేయుట మరియు పరిశీలించుట;

(బీ) అట్టి రక్షణల అమలుపై రిపోర్టులను కేంద్ర ప్రభుత్వమునకు వార్షికముగాను మరియు కమీషను సబబని భావించునట్టి ఇతర సమయములలోను సమర్పించుట;

(సీ) కేంద్రము లేక ఏదేని రాజ్యము మహిళల పరిస్థితులను మెరుగు పరచుటకై రక్షణలను పటిష్టముగా అమలుచేయుటకు అట్టి రిపోర్టులలో సిఫారసులను చేయుట;

(డి) సంవిధానములోను మరియు ఇతర శాసనములలోను మహిళలకు వర్తించు ప్రస్తుత నిబంధనలను ఎప్పటికప్పుడు పునర్విలోకనము చేయవలెను మరియు అట్టి శాసనములలోని లొసుగులను నిబంధనలను తగినంతగా లేకపోవుటకు లోపములను సవరించుటకును తీసుకొనవల్సిన శాసనిక చర్యలను సూచించుచు వాటికి తగిన సవరణలను సిఫార్సు చేయుట;

(ఈ) సంవిధానములోను మరియు ఇతర శాసనములలోను మహిళలకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించిన, కేసులను గుర్తించి సముచిత ప్రాధికారులతో చేపట్టుట;

(ఎఫ్) ఈ క్రింద తెలిపిన విషయములకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి మరియు తనంతటతాను వాటిని గుర్తించి, సముచిత ప్రాధికారులతో అట్టి విషయముల వలన ఉత్పన్నమగుచున్న సమస్యలను చేపట్టుట, అవేవనగా:-

(i) మహిళల హక్కులు హరించుట;

(ii) మహిళలకు రక్షణ సమకూర్చుటకు మరియు సమానత్వము మరియు అభ్యున్నతి సాధించుటకు చేయబడిన శాసనములు అమలు పరచకుండుట;

(iii) మహిళల కష్టములను తొలగించు మరియు వారి సంక్షేమమును కాపాడుటకు వారికి సహాయమును అందించుటకు ఉద్దేశించబడిన విధాన నిర్ణయములను, మార్గదర్శక సూత్రములను లేక సూచనలను పాటించకుండుట;

(జీ) మహిళలపట్ల వివక్షత వలన మరియు వారిపై అత్యాచారముల వలన ఉత్పన్నమగు నిర్దిష్ట పరిస్థితులను గురించి ప్రత్యేక పరిశీలనలు లేక దర్యాప్తులను జరిపించుట మరియు ఆటంకములను గురించి వాటి నివారణకు ఉపాయములను సిఫారసు చేయుట;

(హెచ్) అన్ని రంగములలో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించునట్లు సూచనలు చేయుట కొరకు అభివృద్ధిదాయకమైన విజ్ఞానదాయకమైన పరిశోధనలు చేయుట, మరియు గృహ వసతి లేకపోవుట, మౌలిక సదుపాయములు లేకపోవుట, చాకిరిని, వృత్తిపరమైన ఆరోగ్య సమస్యలను తగ్గించుటకు సహాయక సర్వీసులు, సాంకేతిక పరికరాలు తగినంతగా లేకపోవుటవంటి - వారి అభ్యున్నతికి అవరోధములు కలిగించు అంశములను వారి ఉత్పాదక శక్తి పెంపొందించు అంశములను గుర్తించుట;

(ఐ) మహిళల సామాజిక ఆర్థికాభివృద్ధికై ప్రణాళికల తయారీలో పాల్గొనుట మరియు సలహాలనిచ్చుట;

(జె) కేంద్ర మరియు ఏదేని రాజ్య ప్రభుత్వాల అధీనములో మహిళాభివృద్ధి యొక్క ప్రగతిని నిర్ధారణ చేయుట;

(కె) జైలు, రిమాండు గృహము, ఖైదీలుగా గాని లేక ఇతర విధముగా గాని మహిళలు ఉంచబడిన మహిళా సంస్థ లేక అభిరక్షయందుంచు ఇతర స్థలమును తనిఖీ చేయుట లేక తనిఖీ చేయించుట, అవసరమైనయెడల నివారణోపాయముల గురించి సంబంధిత ప్రాధికారులతో చర్చించుట;

(ఎల్) అనేక మంది మహిళలపై ప్రభావము చూపే దావాలకు డబ్బు సహాయము చేయుట;

(ఎమ్) మహిళలకు సంబంధించిన ఏదేని విషయముపైన, మరియు ముఖ్యముగా కాయకష్టము చేయు మహిళలు ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందుల గురించి ప్రభుత్వమునకు నియతకాలిక నివేదికలను పంపుట;

(ఎన్) దానికి, కేంద్ర ప్రభుత్వముచే నిర్దేశించబడిన ఏదేని ఇతర విషయము.

(2) కేంద్ర ప్రభుత్వము ఉపపరిచ్ఛేదము (1) యొక్క ఖండము (బి)లో నిర్దేశించబడిన సిఫారసులతోపాటు కేంద్రమునకు సంబంధిత సిఫారసులపై తీసికొనిన లేక తీసికొనుటకు ప్రతిపాదించిన చర్యను మరియు అట్టి సిఫారసులలో అంగీకరించనవి ఏవైన ఉన్నచో, అంగీకరించనందుకు గల కారణములను విశదీకరించుచు మెమోరాండముతో పాటు అన్ని నివేదికలను పార్లమెంటు ప్రతి సదనము సమక్షములో ఉంచునట్లు చూడవలెను.

(3) ఏదేని అట్టి నివేదికను లేక అందలి ఏదేని భాగమును అది రాజ్య ప్రభుత్వమునకు సంబంధించినదైనపుడు, కమీషను నివేదికను లేక దాని భాగము యొక్క ప్రతిని అట్టి రాజ్య ప్రభుత్వమునకు పంపవలెను. ఆ రాజ్య ప్రభుత్వము రాజ్యమునకు సంబంధించిన సిఫారసులపై తీసికొనిన లేక తీసికొనుటకు ప్రతిపాదించిన చర్యను మరియు అట్టి సిఫారసులలో వేటినైనను అంగీకరించనిచో, అంగీకరించనందుకు గల కారణముల మెమోరాండముతోపాటు, రాజ్య శాసనమండలి సమక్షములో ఉంచునట్లు చూడవలెను.

(4) కమీషను ఉపపరిచ్ఛేదము (1) యొక్క ఖండము (ఏ) లేక ఖండము (ఎఫ్) యొక్క ఉప-ఖండము (i)లో పేర్కొనిన ఏదేని విషయమును దర్యాప్తు చేయునప్పుడు, ఒక దావాను విచారణ చేయునపుడు సివిలు న్యాయస్థానము కలిగియుండు అధికారములన్నింటిని ప్రత్యేకించి, ఈ క్రింది విషయములకు సంబంధించిన అధికారములు కలిగివుండును, అవేవనగా:-

(ఏ) భారతదేశములోని ఏ భాగము నుండి గాని ఎవరేని వ్యక్తిని సమను చేసి, హాజరుపరచబడి అతనిచే ప్రమాణము చేయించి పరీక్షించుట;

(బి) ఏదేని దస్తావేజులను ప్రకటించుమనియు, దాఖలుపరచమనియు కోరుట;

(సి) అఫిడవిట్లపై సాక్ష్యమును స్వీకరించుట;

(డి) ఏదేని న్యాయస్థానము లేక కార్యాలయము నుండి ఏదేని పబ్లికు రికార్డును లేక దాని నకలును అభ్యర్థించుట;

(ఇ) సాక్షులను మరియు దస్తావేజులను పరీక్షించుటకై కమీషనులు జారీచేయుట;

(ఎఫ్) నిర్ణీతపరచబడు ఏదేని ఇతర విషయము.

## అధ్యాయము - 4

## ఆర్థిక విషయములు, లెక్కలు మరియు ఆడిటు

కేంద్ర ప్రభుత్వ గ్రాంటులు.

11. (1) కేంద్ర ప్రభుత్వము, ఈ విషయములో పార్లమెంటు శాసనము ద్వారా తగు వినియోజనము చేసిన తరువాత, ఈ చట్టపు ప్రయోజనముల కొరకు తాము సబబని తలచునట్టి పైకపు మొత్తములను గ్రాంటుల రూపములో కమీషనుకు చెల్లించవలెను.

(2) కమీషను ఈ చట్టము క్రింద కృత్యములను నిర్వర్తించుటకు తాను సబబని తలచునట్టి పైకమును ఖర్చుపెట్టవచ్చును మరియు అట్టి పైకములను ఉపపరిచ్ఛేదము (1)లో పేర్కొనిన గ్రాంట్ల నుండి చెల్లింపదగు వ్యయముగా పరిగణించబడవలెను.

12. (1) కమీషను, సరియైన లెక్కలను, మరియు వాటికి సంబంధించిన ఇతర రికార్డులను నిర్వహించవలెను మరియు భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు-జనరలుతో సంప్రదించిన మీదట కేంద్ర ప్రభుత్వముచే నిర్ణీతపరచబడునట్టి ప్రరూపములో లెక్కల వార్షిక వివరణను తయారుచేయవలెను. లెక్కలు మరియు ఆడిటు.

(2) కంప్ట్రోలరు మరియు ఆడిటరు-జనరలు తాము నిర్దిష్టపరచునట్టి అంతరావధులలో కమీషను లెక్కలను ఆడిటు చేయవలెను, మరియు అట్టి ఆడిటుకు సంబంధించి అయిన ఏదేని వ్యయమును కంప్ట్రోలరు మరియు ఆడిటరు-జనరలుకు కమీషను చెల్లించవలెను.

(3) ప్రభుత్వ లెక్కల ఆడిటుకు సంబంధించి సాధారణముగా కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలు ఆడిట్ విషయములో కలిగివుండు హక్కులు, విశేషాధికారములు మరియు ప్రాధికారములు ఈ చట్టము క్రింద కమీషను లెక్కల ఆడిటు విషయములోను కంప్ట్రోలరు మరియు ఆడిటరు-జనరలు మరియు అతనిచే నియమింపబడిన ఏ వ్యక్తియైనను అవే హక్కులు, విశేషాధికారము మరియు ప్రాధికారములు కలిగివుండవలెను. మరియు ప్రత్యేకించి పుస్తకముల లెక్కలు, సంబంధించిన ఓచర్లు ఇతర దస్తావేజులు మరియు పత్రములను దాఖలు చేయవలసినదని అభ్యర్థించుటకును, కమీషను యొక్క ఏదేని కార్యాలయములను తనిఖీ చేయుటకును హక్కు కలిగివుండును.

(4) కమీషను, కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలుచే లేక ఈ విషయములో ఆయనచే నియమించబడిన ఎవరేని ఇతర వ్యక్తిచే ధ్రువీకరించబడిన కమీషను లెక్కలను, వాటిపై ఆడిటు నివేదికతోపాటుగా ప్రతి సంవత్సరము కేంద్ర ప్రభుత్వమునకు పంపవలెను.

13. కమీషను ప్రతి ఆర్థిక సంవత్సరము, గత ఆర్థిక సంవత్సరమునందలి తన కార్యకలాపముల గురించి పూర్తి వివరములతో నిర్ణీతపరచునట్టి రీతిలోనూ అట్టి ప్రరూపములోను మరియు అట్టి కాలములోపల వార్షిక నివేదికను తయారుచేసి దాని ప్రతి నొకదానిని కేంద్ర ప్రభుత్వమునకు పంపవలెను. వార్షిక నివేదిక.

14. కేంద్ర ప్రభుత్వము, వార్షిక నివేదికలో, కేంద్ర ప్రభుత్వమునకు సంబంధించినంతమేరకు సిఫారసులపై తీసికొనిన చర్యయొక్క మెమోరాండమును మరియు అట్టి సిఫారసులలో వేటినైనను, అంగీకరించనిచో, అంగీకరించనందుకు గల కారణములతోపాటు వార్షిక నివేదికను పార్లమెంటు యొక్క ప్రతి సదనము సమక్షములో నివేదికలు అందిన వెంటనే త్వరితముగా ఉంచబడునట్లు చూడవలెను. వార్షిక నివేదిక మరియు ఆడిటు నివేదికను పార్లమెంటు సమక్షమున ఉంచుట.

## అధ్యాయము - 5

## వివిధములు

15. కమీషను యొక్క ఛైర్‌పర్సను, సభ్యులు, అధికారులు మరియు ఇతర ఉద్యోగులు భారత శిక్షా స్మృతి, (1860 లోని 45వ చట్టము). యొక్క 21వ పరిచ్ఛేదపు అర్థములో పబ్లికు సేవకులుగా భావించబడవలెను. కమీషను యొక్క ఛైర్‌పర్సను, సభ్యులు మరియు సిబ్బంది పబ్లికు సేవకులుగా ఉండుట.

కేంద్ర ప్రభుత్వము కమీషనుతో సంప్రదించుట.

16. కేంద్ర ప్రభుత్వము, మహిళలపై ప్రభావము కలిగించు అన్ని ప్రముఖ విధాన నిర్ణాయక విషయములలోను, కమీషనుతో సంప్రదించవలెను.

నియమములు చేయుటకు అధికారము.

17. కేంద్ర ప్రభుత్వము, ఈ చట్టపు నిబంధనలను నెరవేర్చుటకు, రాజపత్రములో అధిసూచన ద్వారా, నియమములు చేయవచ్చును.

(2) ప్రత్యేకించియు, పైన చెప్పిన అధికారము యొక్క వ్యాపకతకు భంగము లేకుండాను, అట్టి నియమములు ఈ క్రింది అన్ని లేక ఏవేని విషయముల కొరకు నిబంధించవచ్చును, అవేవనగా:-

(ఏ) 4వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (5) క్రింద ఛైర్‌పర్సను సభ్యులకు మరియు 5వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (2) క్రింద అధికారులకు, ఇతర ఉద్యోగులకు చెల్లించవలసిన జీతములు, బత్యెములు మరియు వారి సేవకు సంబంధించిన ఇతర నిబంధనలు, షరతులు;

(బీ) 8వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద కో-ఆప్టు చేయబడిన వ్యక్తులు కమిటీ సమావేశములకు హాజరగుటకై బత్యెములు;

(సీ) 10వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (4) యొక్క ఖండము (ఎఫ్) క్రింద ఇతర విషయములు;

(డీ) 12వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1) క్రింద లెక్కల యొక్క వార్షిక వివరణ నిర్వహించబడవలసిన ప్రరూపము;

(ఈ) 13వ పరిచ్ఛేదము క్రింద వార్షిక నివేదిక ఏ ప్రరూపములో మరియు ఏ సమయములో తయారుచేయవలెను అనునది;

(ఎఫ్) నిర్ణీతపరచబడవలసిన లేక నిర్ణీతపరచదగు ఏదేని ఇతర విషయము.

(3) ఈ చట్టము క్రింద చేసిన ప్రతి నియమమును, అది చేయబడిన తరువాత; వీలైనంత త్వరలో, పార్లమెంటు అధివేశనములో నున్నచో, దాని ఉభయ సదనముల సమక్షమందును, మొత్తము ముప్పది దినముల కాలావధిపాటు ఉంచవలెను. ఆ కాలావధి ఒకే అధివేశనములోగాని, రెండు లేక అంతకంటె ఎక్కువ అనుక్రమ అధివేశనములలోగాని, చేరివుండవచ్చును. పైన తెలిపిన అధివేశనము లేక అనుక్రమ అధివేశనములకు అవ్యవహితముగా అనంతరము వచ్చు అధివేశనము ముగియుటకు ముందు, నియమములో ఏదేని మార్పు చేయుటకు ఉభయ సదనములు అంగీకరించినట్లయితే లేక నియమము చేయడానికి ఉభయ సదనములు అంగీకరించనట్లయితే, అటు తరువాత నియమము అట్లు మార్పుచేసిన రూపములో మాత్రమే ప్రభావము కలిగివుండును లేక, సందర్భానుసారము, ప్రభావరహితమైయుండును. అయితే, అట్టి ఏదేని మార్పు లేక రద్దు ఆ నియమము క్రింద అంతకుపూర్వము చేసిన దేని శాసనమాన్యతకును భంగము కలిగించదు.

కె. డి. సింగ్,
కార్యదర్శి, భారత ప్రభుత్వము.